అంతర్యామి

# అనామకుడు

సమస్త జీవరాశిలో ఆలోచించడం, విచక్షణతో ప్రవర్తించడం, ఇతర జీవాలపట్ల కారుణ్య భావన కలిగి ఉండటం లాంటి ప్రత్యేకతలతో మనిషి తన ప్రత్యేక ఉనికిని చాటుకుంటున్నాడు. అనాగరిక మానవుడి స్థాయి నుంచి మేధా మథనంతో అనేక రంగాల్లో ప్రతిభ చూపుతూ, అప్రతిహతంగా ఎదుగుతూ నవ నాగరిక మానవుడిగా వెలుగుతున్నాడు.

అన్ని జీవాల్లాగానే పుట్టిన మనిషికి శైశవ దశలో నామకరణం జరగడంతో అసలు కథ ప్రారంభం అవుతుంది. మరణించేదాకా ఆ పేరుతోనే చలామణీ అవుతాడు. మనసులో ఉద్భవించే ఆలోచనలతో దేహం చేసే మంచి అయినా, చెడు అయినా పేరుకు వర్తిస్తుంది. పిల్లలు సమాజంలో మంచి పేరు తెచ్చుకోవాలని పెద్దలు తాపత్రయపడేది అందుకే. చరిత్రపుటల్లో నిలిచేది వ్యక్తుల పేర్లే. ప్రాజెక్టుల శంకుస్థాపన సమయంలో శిలాఫలకాలపై పెద్ద పెద్ద అక్షరాలతో చెక్కే పేర్లు చిరకాలం నిలిచి ఉంటాయి. ప్రజోపయోగ కార్యఫలాలను చూసినప్పుడు వాటి వెనక తగిన కృషి చేసిన మహానుభావులు స్ఫురిస్తారు. అందరిలో మరింత స్ఫూర్తిని రగిలిస్తారు.

కలియుగంలో మోక్షగాములం కావాలంటే పూజలు పునస్కారాలు చెయ్యనక్కరలేదు. భగవంతుడి నామ స్మరణ చేస్తే చాలు. పేరుకు దైవానికి తేడాలేదు. నామ ఉచ్చారణను మించిన ఉపాయం లేదని విజ్ఞుల మాట. విష్ణు నామ సంకీర్తనం వల్ల పృథివిలో గల సర్వ తీర్థాల ఫలం, సర్వ దేవాలయాల దర్శన భాగ్యం కలుగుతుందని పెద్దలంటారు. శ్రీరామ నామ మహత్తు మనకు తెలియనిది కాదు. మహాభారతంలోని విరాట పర్వంలో పాండవుల అజ్ఞాతవాస ఘట్టం కంటతడి పెట్టించకమానదు. దాసదాసీ జనం చేత సేవలు చేయించుకోవలసినవాళ్లు విరాటరాజు కొలువులో పడిన అగచాట్లు అన్నీ ఇన్నీ కావు. ఈ పర్వంలో అతి ముఖ్యమైన అంశం పాండవులు తమ పేర్లు మార్చుకుని ఉనికిని కప్పిపెట్టి ఉంచడం. అది ఎంత కష్టమో అనుభవించేవారికి తెలుస్తుంది.

కొంతమంది కేవలం పనికి ప్రాధాన్యం ఇస్తారు. వారికి తమ పేరును విశ్వవ్యాప్తం చేసుకోవాలన్న కాంక్ష లేకపోయినప్పటికీ, వారు చేసిన మంచి కార్యాలను లోకం గుండెల్లో దాచుకుంటుంది. కలకాలం గుర్తుంచుకుంటుంది. రామరాజ్యం, కృష్ణతత్వం అందుకు ఉదాహరణ.

బహిర్ ప్రపంచానికి తెలియకుండా లోకానికి తమవంతు సహకారాన్నిచ్చే మహాత్ములు కొందరు ఉంటారు. వారు పేరు కోసం పాకులాడరు. ఈ దేహం తమది కాదన్న స్పృహతో



ఉంటారు. ఆలోచనలు కార్యరూపం దాల్చడానికి, శరీరం ఒక పనిముట్టులా సహకరిస్తుండటం వల్ల, కార్య సాఫల్యాలను పేరుకు ఆపాదించి మురిసిపోవడం సరికాదన్నది వారి నిశ్చిత అభిప్రాయం.

అనేక దేవాలయాల్లో అజ్ఞాత భక్తులు వేసే మొక్కుబడులు అసంఖ్యాకం. గుప్తదానాలు చేసేవారు మానవుల్లో పునీత మనస్కులు. దేశ స్వాతంత్ర్య సముపార్జనలో మహాత్మా గాంధీ, నెహ్రూలే కాదు- అజ్ఞాతంగా ఎంతోమంది తమ పరిధిలో కృషిచేశారు. ప్రాణాలర్పించారు. పేరు ప్రభావాన్ని బాగా ఒంటికి పట్టించుకున్న మనిషి, ఆ పేరును సదా వెలుగులో ఉంచడానికి తీవ్రంగా తపన పడతాడు. భూరి దానాలు చేస్తాడు. గుళ్లు గోపురాల గోడలపై తన పేరు చెక్కించుకుంటాడు. విరాళం ఇచ్చినా, దానధర్మాలు చేసినా పేరు ప్రస్ఫుటంగా కనపడేలా, వినపడేలా అన్ని జాగ్రత్తలూ తీసుకుంటాడు. దీన్నే కీర్తి కండూతి అంటారు.

మనిషి అంతగా కీర్తి కోసం పాకులాడకూడదన్నది ప్రాజ్ఞుల ఉవాచ. గీతలో కృష్ణ భగవానుడు చెప్పినట్లు- కర్మ చేస్తూ పోవడమే మన పని. ఫలితం భగవద్ కృప. మనమే కర్తలమని పొంగిపోవడం సరికాదు. వ్యక్తిని గుర్తించడానికి పేరు తప్ప ఆడంబర జీవితానికి అది సూచిక ఎంతమాత్రం కాదు. ఇది తెలుసుకుంటే మనిషిగా, ఆడంబరంగా, యాంత్రికంగా జీవించకుండా, మనసుతో పరిపూర్ణంగా జీవించి మానవత్వ పరిమళాలను సర్వత్రా వెదజల్లుతాడు. అనామకుడైతేనేం- అందరి మనసులకూ దేవుడిలా దగ్గరవుతాడు!

– ప్రతాప వెంకట సుబ్బారాయుడు